గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ

మోత్కూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా, కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ మంచినీటి సహాయకులదేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఆలేరు డీఈ పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి ట్యాంకులను శుభ్రపర్చడం, క్లోరినేషన్ నిర్వహించే ప్రక్రియను ప్రతి నెలలో చేపట్టాలన్నారు. ఏఈ రాజయ్య మంచినీటి సహాయకులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవోలు నిరంజన్ అలీ, శంకరయ్య, ఎంపీఓలు జనార్థన్‌రెడ్డి, పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అనూష, రాఖేష్ పాల్గొన్నారు.

యాదాద్రిలో శాస్త్రోక్తంగా కల్యాణం



కల్యాణ మూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: స్వయంభూ క్షేత్రమైన యాదాద్రి పంచనరసింహ స్వామి క్షేత్రంలో మంగళవారం నిత్య, సంప్రదాయ ఆరాధనలు ఆలయ శాస్త్రరీత్యా కొనసాగాయి. ఆలయ మూలవరులకు నిజాభిషేకం, తులసీ అర్చన, క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. పంచామృతంతో అభిషేకం చేపట్టారు. దర్శనమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రివేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన సహస్ర నామార్చన నిర్వహించారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయాన్ని వెల్లడించారు. మంగళవారం వివిధ విభాగాల ద్వారా రూ.8,51,829 చేకూరింది.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

○ స్త్రీ నిధి ద్వారా 300 యూనిట్లు ○ నేరుగా బ్యాంకర్ల ద్వారా రుణాలు

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు డీఆర్‌డీఏ కార్యాచరణ రూపొందించింది. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పాడి గేదెల కొనుగోలుకు రుణాలు



ఇస్తోంది. జిల్లా సరిహద్దు మండలాలు జంట నగరాల శివారుల్లో ఉండటంతో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఎంచుకుని అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. కొందరు రైతులకు పాడినే జీవనాధారం. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు పాడి గేదెల కొనుగోలుకు ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ సంకల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 13 కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. స్త్రీ నిధి ద్వారా రుణాలు తక్కువ వడ్డీపై ఇవ్వనున్నారు. జిల్లాలో 300 మంది సభ్యులకు తొలి విడతగా పాడి గేదెల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నారు. రాయితీ లేకుండా ఒక్కో సభ్యురాలికి గేదె కొనుగోలుకు 12 శాతం వార్షిక వడ్డీపై రూ.95 వేల రుణాన్ని స్త్రీ నిధి ద్వారా ఇవ్వనున్నారు. గేదె కొనుగోలు, రవాణా, బీమాకు కలుపుకొని ఈ మొత్తాన్ని వినియోగిస్తారు. రుణం తీసుకున్న వారు 24 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మేలు జాతి రకం గేదెలు ఇతర రాష్ట్రాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్న నిబంధన విధించడంతో తొలి విడతగా 60 గేదెలను కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉండీకి బృందం మంగళవారం బయలుదేరి వెళ్లింది. ఎంపిక చేసిన లబ్ధిదారులు కూడా వెళ్లారు. రెండు మూడు రోజుల్లో అవి రానున్నాయి. లబ్ధిదారుల ఇష్టం మేరకు త్వరలో మిగిలిన వాటిని విడతల వారిగా కొనుగోలు చేస్తామని డీఆర్‌డీవో టి.నాగిరెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మహిళల స్వయం సమృద్ధితో పాటు పాడి ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా రుణాలు ఇవ్వనున్నామని వెల్లడించారు.

యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పాడిపరిశ్రమ ఇలా...

ప్రస్తుతం ఉన్న పాడి పశువులు :
గేదెలు: 1,22,621
ఆవులు : 69,174
పాల ఉత్పత్తి రోజుకు : 5 లక్షల లీ. అంచనా

బ్యాంకర్ల ఆర్థిక సాయంతో..

పాడి గేదెల పెంపకంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నేరుగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నారు. ప్రాధాన్యేతర రంగాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే 180 మహిళలకు రుణాలు ఇచ్చేందుకు అంగీకరించి మంజూరు చేశారు.

బాపూజీ మాటే.. చైతన్య బావుట

◆ నేడు మహాత్మాగాంధీ జయంతి

అహింస, శాంతి అనే రెండు ఆయుధాలతోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి.. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన జాతిపిత మహాత్మాగాంధీ. నేటి సమాజానికి ఆయన సూచించిన అహింస, మహిళా సాధికారత, స్వచ్ఛత బాట మనకు ఎంతో అవసరం. నేడు 'మహాత్మాగాంధీ జయంతి' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం. మిర్యాలగూడ పట్టణం, మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

స్వచ్ఛతతోనే ఆరోగ్య సిరులు

మహాత్మాగాంధీ కలలు గన్న అంశాల్లో ప్రధానమైనది స్వచ్ఛత. ఆయన ఆశయాల సాధనలో భాగంగా సరిగ్గా పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పలు నగరాలు, పట్టణాల్లో మురికివాడలు, వాటిలో నివసించే పేదల అభ్యున్నతే గాంధీజీ ధ్యేయం. ప్రస్తుత సమాజంలో చైతన్యం కరవై.. అధికారుల్లో నిర్లక్ష్యం అధికమై స్వచ్ఛత కనుమరుగైంది. దీంతో ఇటీవల ఉమ్మడి జిల్లాలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి.. దోమలు వ్యాప్తి చెంది వేలాది మంది విష జ్వరాల బారిన పడ్డారు. స్వచ్ఛతలో నల్గొండ పురపాలిక ఇటీవలే జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించింది. నల్గొండ పురపాలికను ఆదర్శంగా తీసుకుని మిగతా పట్టణాల్లో ప్రజలు, అధికారులు సంఘటితంగా స్వచ్ఛతను పాటిస్తే పరిసరాలు పరిశుభ్రమవుతాయి. గాంధీజీ ఆశయం నెరవేరుతుంది.

"నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలం లేని విద్య, త్యాగంలేని ఆరాధన, మానవత్వం లేని శాస్త్రజ్ఞానం, నియమనిష్టలు లేని రాజకీయం.. ఇవే సామాజిక పాపాలు." - మహాత్మా గాంధీ

"మీరు చీపురు, బకెట్ మీ చేతుల్లోకి తీసుకోనంత వరకు.. మీ పట్టణాలు, నగరాలను శుభ్రం చేయలేరు"

ప్రధాన పట్టణాల్లో నిత్యం సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలు (కిలోల్లో)..

పట్టణం	ప్లాస్టిక్ వ్యర్థాలు..
నల్గొండ	150
సూర్యాపేట	40
మిర్యాలగూడ	30
యాదగిరిగుట్ట	40

మహిళా సాధికారతే లక్ష్యం

స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తే ఆ దేశం ప్రగతి పథంలో వెళ్తుందని గాంధీజీ నమ్మకం. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని మహిళలు పలు రంగాల్లో రాణిస్తూ.. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో స్వర్ణభారతి సహకార పరపతి సంఘం ఘనతే ఓ ఉదాహరణ.. అక్కడ 17 గ్రామాల్లో మహిళల సమైక్య జీవన సౌందర్యం ఉట్టిపడుతోంది. వారి ఐక్యత రూ.30 కోట్ల లావాదేవీలకు ఊతమిచ్చింది. కొన్నేళ్ల కిందట ఆ మగువలంతా నిరుపేదలే. పూట గడవని స్థితి నుంచి పిల్లల్ని ఉన్నత చదువులకు పంపే స్థాయికి ఎదిగారు.

"మహిళలు మేధోపరంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పురుషులతో సమానంగా ఉంటారు. వారు స్వతంత్రతతో, ఆత్మవిశ్వాసంతో ఉండేలా విద్యావంతులను చేయాలి. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం అందించేందుకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వాలి"


ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాల సభ్యుల వివరాలు..

జిల్లా/పట్టణం	సభ్యులు
నల్గొండ	2,83,000
సూర్యాపేట	1,76,250
యాదాద్రి	1,49,490
కోదాడ	30
భువనగిరి	20



ప్రతినబూనుదాం

ఏ ఆయుధంతోనైతే మహాత్ముడు దేశానికి స్వేచ్ఛా, ఊపిరి లూదారో.. ఆ ఆయుధమైన అహింస నేటి సమాజంలో కనుమరుగవుతోంది. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఏటా అక్టోబరు 2న **'అంతర్జాతీయ అహింసా దినోత్సవాన్ని'** నిర్వహించుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని కొందరు యువత దుర్వ్యసనాలతో చదువులను అర్ధంతరంగా ఆపేసి.. మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఆర్థిక అవసరాలు తీర్చలేదని విచక్షణ రహిత దాడులకు దిగుతున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి తల్లిదండ్రుల ప్రాణాల్నే తీస్తున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి.



"సత్యం, అహింస నా మతం. నిజాన్ని దైవంగా భావిస్తా.. అహింస రూపంలో దేవుడిని దర్శిస్తా"

★ ఇటీవల మిర్యాలగూడలోని ఓ కాలనీలో 12 ఏళ్ల బాలుడు.. ఐదేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో పెద్దలు.. రాయబారం నడిపి రాజీ కుదిర్చారు. ఆ కాలనీలో యువత నిత్యం మత్తు పదార్థాలు తీసుకుంటూ.. చేస్తున్న చర్యలే ఆ బాలుడికి ప్రేరణగా నిలిచాయని స్థానికులు చెబుతున్నారు. అహింసా వాదాన్ని ప్రేరేపించే చర్యలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి.


మహాత్ముడి బాటలో 'నేను.. నా మిర్యాలగూడ..'

మహాత్ముడి ఆశయాల సాధనలో భాగంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా 'నేను.. నా మిర్యాలగూడ..' నినాదంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ మిర్యాలగూడను తయారు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గాంధీ జయంతి రోజు నుంచి ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి.. వారికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విద్యా, వైద్యం బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

"గాంధీ జయంతి రోజు నుంచి మిర్యాలగూడ పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. ఎవరైనా ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" – ఎమ్మెల్యే బీఎల్‌ఆర్


మిర్యాలగూడలోని ప్లాస్టిక్ సంచుల దుకాణదారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ (పాత చిత్రం)

బతుకమ్మ పండగొచ్చె ఉయ్యాలో..


చౌటుప్పల్: ట్రినిటీ స్కూల్‌లో 12 క్వింటాళ్ల పూలతో 24 అడుగుల ఎత్తుతో తీర్చిదిద్దిన బతుకమ్మ వద్ద ఆటాపాట


భువనగిరి: అమ్మవారి అలంకారంలో..


భువనగిరి: సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలతో యువతులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలకు వేళైంది. తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి మహిళలు, యువతులు, చిన్నారులు ఆడుకునే పూలపండగ బుధవారం నుంచి మొదలుకానుంది. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. సెలవుల నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

భువనగిరి పటణం, చౌటుప్పల్, న్యూస్‌టుడే:

అనుమానాస్పదస్థితిలో నవ వధువు బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకొని ఐదు నెలలు గడవకముందే నవ వధువు, మూడు నెలల గర్భిణి బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా శివపురం గ్రామానికి చెందిన చల్ల కృష్ణ ప్రసాద్ తల్లిదండ్రులతో సహా 11 ఏళ్ల క్రితం పోచంపల్లికి వలస వచ్చారు. కృష్ణప్రసాద్ ఓ కిరాణ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మీనాపుల్లూరుకు చెందిన శివపార్వతి (20) తల్లి కువైట్‌లో గృహ సహాయకురాలిగా పని చేయడానికి వెళ్లగా పోచంపల్లిలో ఉంటున్న అమ్మమ్మ వద్దకు వచ్చారు. ఇక్కడ పరిచయమైన కృష్ణప్రసాద్‌ను ఇష్టపడ్డారు. ఉన్నత చదువు నిమిత్తం శివపార్వతి తిరిగి సొంతూరు వెళ్లగా.. కృష్ణప్రసాద్ అక్కడికి వెళ్లి పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకున్నారు. దంపతులిద్దరూ పోచంపల్లికి వచ్చి ఉంటున్నారు. శివపార్వతి గర్భం దాల్చడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె భర్త, అత్తామామతో గొడవలు జరిగాయి. ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

నిల్వకు నీడలేదు.. తూకానికి చోటులేదు

★ సాగు విస్తీర్ణం పెరగడంతో అద్దెకు దొరకని భూములు


కనగల్: ఏమిరెడ్డిగూడెంలో గతంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసిన స్థలంలో పంటల సాగుకు ఏర్పాట్లు

ఈనాడు, నల్గొండ – న్యూస్‌టుడే, కనగల్

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లకు స్థలాల కొరత ప్రతిబంధకంగా మారింది. ఈ సీజన్‌లో భారీ వర్షాలకు తోడు, రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జున సాగర్ నిండుకుండగా మారడంతో గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భారీ దిగుబడులతో పాటు సన్నాలు ఎక్కువగా అమ్మకానికి వస్తాయనే నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధికారులు 1005 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించారు. ఇందులో సుమారు 35 శాతం కేంద్రాలకు స్థలాల కొరత ఉందని ప్రాథమికంగా తెలిసింది.

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
కొనుగోలు కేంద్రాలు	375	340	290

● జిల్లా ● కొనుగోలు కేంద్రాలు

అంచనాలు ఇలా..

ప్రస్తుత సీజన్‌లో 10.53 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. ఈ సీజన్ నుంచే ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 5.5 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగవుతున్నాయి. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భారీగానే వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్న, దొడ్డు రకాలు కలిపి 15.6 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కరోనా సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల ఎంటీల వరకు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో అది దాటే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 'కొనుగోళ్లకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా వ్యవహరిస్తున్నామని, స్థలాలు లేని చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామ'ని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి

సాధారణంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సీజన్ల వారీగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుంటే ప్రైవేటు వ్యక్తుల భూములను అద్దెకు తీసుకుంటారు. భూగర్భజలాలు పెరగడంతో ఇన్నాళ్లు పడావు ఉన్న భూములూ సాగులోకి వచ్చాయి. గ్రామాల్లో రెండు నుంచి మూడెకరాల వరకు భూమి ఉంటే అందులో ఒక సీజన్‌లో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తే నెలకు సదరు యజమానికి రూ.10 వేల వరకు చెల్లించేవారు. ఇప్పుడు రూ.15 వేల వరకు ఇస్తామన్నా పల్లెల్లో భూమి దొరకని పరిస్థితి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. మరో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు సరకు పోటెత్తనుంది. స్థలాల కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

★ ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం : 10.56 లక్షల ఎకరాలు
★ దిగుబడి అంచనా : 28 లక్షల ఎంటీలు
★ కొనుగోలు కేంద్రాలకు రానున్న దొడ్డు, సన్నరకాలు: 15.5 లక్షల ఎంటీలు

శిశువుల ఊపిరికి ఊతం..!


సూర్యాపేట నియోనేటల్ వాహనంలో శిశువుకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

☛ అత్యవసర పరిస్థితుల్లో 108 నియోనేటల్ వాహన సేవలు

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే:

నవజాత శిశువు సంరక్షణలో భాగంగా గత ఏడాది ఆగస్టు నుంచి ప్రభుత్వం '108' నియోనేటల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున మొత్తం మూడు వాహనాలను అందించింది. అత్యవసర వైద్యం అవసరమైన వేలాది మంది శిశువుల ప్రాణాలను రక్షించడంలో వాహనాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది శిశువులకు సేవలందించింది.

వాహనంలోనే మినీ ఐసీయూ

అప్పుడే జన్మించిన శిశువు నుంచి 30 రోజుల(నెల)లోపు వయస్సు పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా అప్పుడే జన్మించిన శిశువులు ఎక్కువగా శ్వాస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. సకాలంలో పెద్దాసుపత్రులకు తరలించాలంటే అంబులెన్సులోనే మినీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) వంటి వ్యవస్థ అవసరం. సరిగ్గా అదే విభాగాన్ని అధునాతన పరికరాలతో 108 నియోనేటల్ వాహనాన్ని రూపొందించారు. కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడీ, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయటి నుంచి శ్వాస అందించే బ్యాగ్‌మాస్క్ డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో వాహనంలో నిరంతరం అందుబాటులో ఉండేలా ఇద్దరు చొప్పున ఈఎంఆర్‌లు, మరో ఇద్దరు పైలెట్లను నియమించారు.

నల్గొండ, భువనగిరి జిల్లా నియోనేటల్ కేసుల వివరాలు

నెల	నమోదైన కేసుల సంఖ్య	
	నల్గొండ	భువనగిరి
ఏప్రిల్	41	63
మే	35	61
జూన్	42	70
జులై	43	52
ఆగస్టు	44	50
సెప్టెంబరు	46	63

శిశు మరణాల రేటు తగ్గుతోంది



– నజీరొద్దీన్, ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో శిశు మరణాల రేటును తగ్గించగలిగాం. అనారోగ్యంతో జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాసుపత్రులకు తరలిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాసుపత్రులకు, అవసరమైతే జిల్లా కేంద్రాసుపత్రుల నుంచి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలిస్తున్నాం. వాహనంలో అందుబాటులో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లి గర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం. ఈ సదుపాయంతో పేద తల్లిదండ్రులపై రూ.వేలల్లో ఆర్థిక భారంతోపాటు మానసిక ఆందోళన తప్పుతోంది.

వృద్ధుల హక్కులను పరిరక్షించాలి


వృద్ధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో తల్లిదండ్రుల యోగక్షేమాలు చూసుకునే బాధ్యత పిల్లలదేనని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం 2007 ప్రకారం తల్లిదండ్రులను ఆర్థికంగా, ఆరోగ్య పరంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. విలువలతో కూడిన సంస్కృతి, సంప్రదాయాలు పిల్లలకు నేర్పించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోని పిల్లలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి రాసిచ్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులను కలెక్టర్ సన్మానించారు. అనంతరం వయో వృద్ధులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, డీఎంహెచ్‌వో యశోద, భువనగిరి ఆర్డీవో అమరేందర్, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బాలేశ్వర్, పోలి శంకర్‌రెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బాలరాజు, సూపరింటెండెంట్ శశికళ, సీడీపీవోలు స్వరాజ్యం, శైలజ, జ్యోత్స్న, సమీరామీర్జా పాల్గొన్నారు.

ఆరోగ్య జిల్లాగా మార్చాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఆరోగ్య జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ఏడీ పీహెచ్‌వో డా.మనోహర్ కోరారు. తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి ఆశాడే సందర్భంగా చౌటుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగాలని, అబార్షన్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలకు, తల్లులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని, శిశువుకు జన్మించిన వెంటనే ముర్రుపాలు తాగించేలా తల్లులకు అవగాహన కల్పించాలని, ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలని సూచనలిచ్చారు. ఎన్‌సీడీ పథక అధికారి డా.సుమన్‌కల్యాణ్, డా.సంపత్, పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కాటంరాజు పాల్గొన్నారు.

ఇంతినిండుగా.. పూల పండగ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (పాతచిత్రం)

ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనది. తీరొక్క పూలను తీసుకువచ్చి, బతుకమ్మగా పేర్చి పూజలు చేసే సంప్రదాయం తెలంగాణ సొంతం. చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు ఆడుతూ.. పాడుతూ.. కష్టాలు మరిచేలా చేసే అరుదైన వేడుక ఇది. మహిళలకు ఇష్టమైన పూల పండగ బతుకమ్మ రానే వచ్చింది. పల్లె.. పట్టణం అంతటా 'బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో'.. అంటూ సాగే పాటలు మారుమోగనున్నాయి. నేటి నుంచి ఎంగిలిపువ్వు బతుకమ్మతో సంబరాలు ప్రారంభం కానున్నాయి. - మోత్కూరు, సూర్యాపేట సాంస్కృతికం, నాంపల్లి, న్యూస్‌టుడే

ఆశ్వయుజ మాసంలో రాష్ట్రంలో జరుపుకొనే పండగల్లో అత్యంత విశిష్టమైనది బతుకమ్మ. ఆడపడుచులు ఆత్మీయదేవతగా కొలిచే ఈ పూలరాసి పండగ ప్రకృతి ప్రాముఖ్యాన్ని చాటుతుంది. 'ఎన్ని కష్టాలు వచ్చినా.. ఆపదలు మీదపడినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు కదలాలి. కలకాలం నిండు నూరేళ్ల బతుకును పండగలా తీర్చిదిద్దుకోవాలంటూ బతుకమ్మ సందేశాన్నిస్తుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ నెల 2 నుంచి బతుకమ్మ సంబురాలు మొదలై.. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఏటా సూర్యాపేట, నల్గొండ, భువనగిరి, నకిరేకల్, హుజూర్‌నగర్ పట్టణాల్లో బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.



పూలను పేర్చడం ఓ కళ

బతుకమ్మ పండగలో ప్రత్యేకం ఆట పాటలు, అలంకరణ. బతుకమ్మ పేర్చేటప్పుడు రెండు, ఐదు, ఏడు రకాల పూలను వాడుతారు. తూర్పు, ఉత్తరం వైపుగాని కూర్చొని పేర్చుతారు. తాంబాలంలో గుమ్మడి ఆకులు పరిచి దానిపై పసుపు, కుంకుమలతో బండారు వేస్తారు. చుట్టూ ముత్తైదువులకు బొట్టు ఇచ్చి పేర్చడం ప్రారంభిస్తారు. పక్కనే నిండు నీళ్ల చెంబును ఉంచుతారు. తప్పనిసరిగా తంగేడు పూలు మొదటివరసలో పేర్చుతారు. తరువాత గునుగు వరస, మిగతావి వరసలో బంతి, సీతమ్మజడ, పోకబంతి, బీరపువ్వు తదితరాలను అలంకరిస్తారు.

ఏడురకాల పూలతో బతుకమ్మను, మరో చిన్న బతుకమ్మను తోడుగా పేర్చుతారు. పసుపుతో గౌరమ్మను చేసి చిక్కుడాకుల్లోగానీ, తమలపాకుల్లోగానీ పెడతారు. పత్తితో వస్త్రం చేసి అలంకరిస్తారు. ఇంటి ఆనవాయితీ అనుసరించి ఒకతల, రెండుతలల గౌరమ్మను తయారు చేస్తారు. మంగళహారతులు సమర్పిస్తారు.

- ● తెలంగాణ సంస్కృతికి పట్టుకొమ్మ బతుకమ్మ పర్వదినం
- ● నేటి నుంచి సంబరాలు షురూ

రోజుకో బతుకమ్మ.. నైవేద్యాలు

మొదటి రోజు ఎంగిలిపువ్వు బతుకమ్మ: వక్కలు, తులసి ఆకులు, నత్తపిండి నైవేద్యం

అటుకుల బతుకమ్మ: పప్పు, బెల్లం, ప్రసాదం

ముద్దపప్పు బతుకమ్మ: బెల్లం వేసి ఉడికించిన సెనగ పప్పు

నానబియ్యం బతుకమ్మ: పాలలో నానబెట్టిన బియ్యం పిండిలో బెల్లం

అట్ల బతుకమ్మ: అట్లు/దోశ నైవేద్యం

అలిగిన బతుకమ్మ: కొన్నిచోట్ల బతుకమ్మను పేర్చరు, ఆడరు.

వేపకాయల బతుకమ్మ: పప్పు, బెల్లం

వెన్నముద్దల బతుకమ్మ: నువ్వులు, బెల్లం కలిపిన ముద్ద

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ: పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా... ఐదురకాల సద్దులతో నైవేద్యం సమర్పిస్తారు

బతుకమ్మ సారం ఇదే ఉయ్యాలో..

మహిళలను గౌరవిద్దాం..: పితృదేవతలను స్మరించుకునే రోజు మొదలయ్యే బతుకమ్మ మహిళలను గౌరవించటం నేర్పే పండగ. ఇంటిల్లిపాదీ చల్లగా ఉండాలని గౌరమ్మను వేడుకునే పర్వదినం. మహిళలను గౌరవించటం, ఆదరించటం, ప్రేమానురాగాలతో వారిని చేరదీయడం, అమ్మతనంపై భక్తి లాంటి సందేశాలు ఈ వేడుకలో ఇమిడి ఉన్నాయి. మానవజాతి మనుగడ స్త్రీని గౌరవించటంలో ఉందని చాటుతుంది.

'మొక్క'వోని దీక్ష: పువ్వు అంటే రేపటి ఫలం. నేటి మొక్కే రేపటి జీవనాధారం. చెట్ల ప్రాధాన్యం, పువ్వు గొప్పతనాన్ని, జలం, భూమితో మానవునికి ఉన్న సంబంధాలు, కుటుంబ బంధాలను తెలిపే బతుకమ్మ పాటలు అనేకం వీటిని బతికించుకునేందుకు పుట్టినవే.

వివక్షకు తావులేకుండా..: కుల, మత, ధనిక, పేద బేధం లేని పండగ ఇది. వివక్షలకు తావులేని సమాజం కోరుకునే ఇందులో దాగిన ఆంతర్యం.

జలవనరుల శుద్ధి..: వివిధ రకాల పూలు, ఆకులతో బతుకమ్మలను పేర్చి తిరిగి వాటిని చెరువులు, నదులు, పంటకాల్వల్లో వదులుతారు. అనేక ఔషధ గుణాలున్న పూలు నీటిని శుభ్రపర్చి జలచరాలను కాపాడతాయి. ఇది శాస్త్రీయంగా నిరూపణ జరిగింది.



హుజూర్‌నగర్‌లో బతుకమ్మ ఆట, పాట(పాత చిత్రం)

- హుజూర్‌నగర్, న్యూస్‌టుడే



చౌటుప్పల్‌లో బతుకమ్మ ఆడుకోవడానికి వెళ్తున్న మహిళలు

'పల్లె' వించిన పాట

తెలంగాణ గ్రామీణ జీవనంతో ముడిపడి ఉన్న ప్రతి అంశాన్ని బతుకమ్మ పాటలో వినవచ్చు. ప్రతి చరణం చివర ఎక్కువగా 'ఉయ్యాలో', 'కోల్', 'చందమామ', 'వలలో' వంటి పదాలు వినిపిస్తాయి. జన జీవనం, మహిళల కోర్కెలు, భావనలూ, ఆలోచనలూ అంతర్లీనంగా వినిపిస్తాయి. వర్షాకాలంలో పంటలు పండుతున్న కాలంలో బతుకమ్మ వస్తుంది. అందుకే ప్రకృతిలక్ష్మీ స్వరూపంగా పూజిస్తారు. సద్దుల రోజు బతుకమ్మ సమీపంలోని చెరువు, కుంటలు, నదుల్లో, ఆలయ ప్రాంగణాల్లోని కోనేర్లు, బావుల్లో వదిలిపెడుతూ పోయిరావమ్మా బతుకమ్మ.. పోయి రావమ్మా.. మళ్లొచ్చే ఏడాది మళ్లీరావమ్మా.. అంటూ పాటలు పాడుతూ సాగనంపుతారు.

ఇది మన సంస్కృతి..

- మర్రి జయశ్రీ, కవయిత్రి, మోత్కూరు



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేదే బతుకమ్మ పండగ. ప్రకృతిని ఆరాధించే ఈ పూల పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైనది. నా చిన్నతనం నుంచి ఇప్పటి వరకు ఈ పండుగ ప్రాశస్త్యం ఏమాత్రం తగ్గలేదు. ఇంకా పెరుగుతోంది. బతుకమ్మ పేర్చడంలో, పాటలు పాడటంలో అదే సంప్రదాయం కొనసాగుతోంది.

గడువు ముగిసె..!

★ ఉమ్మడి జిల్లాలో రావాల్సిన సీఎంఆర్ 4.53 లక్షల మెట్రిక్ టన్నులు


హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రావాల్సిన సీఎంఆర్ బియ్యం రాలేదు.. మిల్లర్లకు ఇచ్చిన గడువు మాత్రం గత నెల 30తో ముగిసింది. బకాయి సీఎంఆర్ వసూలుకు మళ్లీ గడువిస్తే తప్ప వసూలయ్యే అవకాశం లేదు. ఇందుకు అధికారులు, మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్ సీఎంఆర్ బకాయిలను వసూలు చేసేందుకు జులై మొదటి వారం నుంచి 90 రోజులు గడువు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం, యాసంగి కలిపి గత నెల 21 నాటికి 4,53,399 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ గడువు ముగిసింది. మరో వారం రోజుల్లో కొత్త ధాన్యం వస్తున్న క్రమంలో ఇంకా సీఎంఆర్ బకాయిలు ఉండటం అధికారులకు సమస్యగా తయారైంది. పాత బకాయి ఉన్నవారికి కొత్త ధాన్యం కేటాయింపులు చేయకూడదు. వానాకాలం సీజన్‌లో భారీగా ధాన్యం వస్తున్న క్రమంలో బకాయిదారులు అంటూ పక్కన పెడితే కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు తలనొప్పిగా మారుతుంది. మరోసారి గడువు పెంచడం తప్ప వేరే మార్గం లేదని అధికారులు చెబుతున్నారు.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు (సెప్టెంబరు 21 నాటికి మెట్రిక్ టన్నుల్లో..)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

యాదాద్రి స్వర్ణతాపడం ఆకృతి ఖరారు..!

ఈనాడు, నల్గొండ : స్వయంభు క్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయడానికి అనువుగా అధికారులు వేగంగా కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా కీలకమైన స్వర్ణమయ ఆకృతిని తాజాగా ఖరారు చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. యాదాద్రి స్వర్ణతాపడ పనులపై ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. ఆకృతి ఖరారుతో త్వరలోనే పనులు మొదలు కానున్నాయి. తొలుత స్వర్ణతాపడాన్ని 127 కిలోల బంగారంతో చేయాలని నిర్ణయించినా వివిధ కారణాలతో దాన్ని 65 కిలోలకు తగ్గించారు. ఇందుకు దేవస్థానం వివిధ వర్గాల నుంచి విరాళాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు 11 కిలోల బంగారంతో పాటు రూ.20 కోట్ల నగదు సమకూరినట్లు సమాచారం. ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో విరాళాల ద్వారా వచ్చిన నగదుతో బంగారం కొనుగోలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. బంగారు తాపడంపై ఒక ట్రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడవుతాయని దేవస్థాన కీలక అధికారి ఒకరు 'ఈనాడు'కు వెల్లడించారు.



నయనానందకరం.. అమ్మరూపం

◆ 3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: సకల శుభాలకు మూలం విజయదశమి. ఆ రోజు ఏ కార్యం తలపెట్టినా మంచి ఫలితాలు ఇస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హిందువుల పెద్ద పండగల్లో విజయదశమి ముఖ్యమైంది. ఈ నెల 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దుర్గామాత రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని కాలనీలలో, ఊరూరా కమిటీ సభ్యులు మండపాలను సిద్ధం చేసి తొమ్మిది రోజులు నిష్ఠతో దుర్గాదేవి అమ్మవారిని పూజించేందుకు ఏర్పాటుచేస్తున్నారు.

3న **ఆదిలక్ష్మి:** ఈ నెల 3న అమ్మవారు ఆదిలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భగవంతుడిని గుర్తించడానికి ప్రధాన లక్షణమైన అమ్మకు లక్ష్మీ అని పేరు. భగవద్ తత్వాన్ని లక్ష్మీ అమ్మతోనే గుర్తించడంతో ఆ పేరు వచ్చిందని పండితులు చెబుతున్నారు.

4న **సంతానలక్ష్మి:** సకల చరాచర జగత్తు అంతా అమ్మవారి సంతానమే. అందుకే అమ్మవారు సంతాన లక్ష్మి అని ప్రతీతి. సంతాన లక్ష్మి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శిస్తే ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

5న **గజలక్ష్మి:** గజలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధించి దేవేంద్రుడు త్రైలోక్యాధిపతి అయినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే మహా సంపద కలుగుతుందని విశ్వసిస్తారు.



6న **ధనలక్ష్మి:** ఈ సృష్టిలో ధనం అంటే విద్యా, హిరణ్య, శక్తి, ఈ మూడు విధాలైన ధనాన్ని ప్రసాదించే అమ్మను ధనలక్ష్మి మాతగా కొలుస్తుంటాం.

7న **ధాన్యలక్ష్మి:** ఈ రోజు అమ్మవారిని ధ్యానలక్ష్మిగా పూజలందుకోనుంది. ధనధాన్యం సిద్ధించాలని అమ్మవారిని కొలుస్తుంటారు. భూమి మీద ధన ధాన్యాన్ని ప్రసాదించే అమ్మవారే. అమ్మవారిని ఆరాధిస్తే సకల బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

8న **విజయలక్ష్మి:** అమ్మవారు విజయలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని జ్ఞానేశ్వరి విజయప్రధాయని అని కీర్తిస్తుంటారు. మనం ఏ పని తలపెట్టిన విజయం సాధించాలని అమ్మవారిని కొలిస్తే తప్పక చేకూరుతుందని విశ్వసిస్తారు.

9న **ఐశ్వర్యలక్ష్మి:** ఐశ్వర్య రూపంలో దర్శనం ఇచ్చే అమ్మవారిని కొలిస్తే సకల సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మవారు.

10న **వీరలక్ష్మి:** అమ్మవారు వీరలక్ష్మిగా ఆవిర్భవించి మహిషాసురుడిని సంహరించింది. ఉపద్రవాలను పారదోలి సకల శుభాలను కలుగుజేస్తుందని భక్తుల నమ్మకం.

11న **మహాలక్ష్మి:** అష్టలక్ష్మీ రూపాలను ధరించిన అమ్మ కరుణా స్వరూపమైన నిజరూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. మనిషికి అవసరమైన ధనం, ధాన్యం, సంతానం, విద్య, ఇలా అన్ని అవసరమైన అష్టైశ్వర్యాలను మహాలక్ష్మి అమ్మవారు ప్రసాదిస్తారు.

పెద్దలు.. దీవెనలందించే పెత్తరమాస

చిట్యాల, న్యూస్‌టుడే: పితృదేవతలను తలచుకొని వారిపేరిట తర్పణాలు విడిచే కాలాన్ని 'మహాలయ పక్షం', 'పితృపక్షం' అని పిలుస్తుంటారు. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య మధ్యనున్న (సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు) 15 రోజుల కాలాన్ని 'మహాలయ పక్షం'గా పరిగణిస్తారు. మనిషి ఎంత ఎదిగినా, తన జన్మకి, సంస్కారం, సంస్కృతికి కారణమైన మన పెద్దలే వాటికి మూలాలని మరిచిపోకుండా తండ్రి, తాత, ముత్తాతలను తలచుకొని పుత్రులు నిర్వహించే ఓ కార్యక్రమం ఇది. శ్రాద్ధ, తర్పణ, పిండ ప్రదానంతో కూడిన పితృ యజ్ఞ విధులను, ఏటా ఒకరోజు వారిని తలచుకునేందుకు హిందూ పురాణాల్లో నిర్దేశించినదే మహాలయ పక్ష కాలం. 14 రోజుల్లో కుదరని పరిస్థితిలో చివరిరోజు అమావాస్యనాడు అందరి పేరిట విడవవొచ్చు. అందుకే ఆ రోజును 'సర్వపితృ అమావాస్య' అంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో పెత్తరమాస అని స్థానిక వాడుకభాషలో పలుకుతుంటారు.

ఎందుకు చేయాలంటే..

మహాలయ అమావాస్యరోజు పితృదేవతలు వారి సంతానం ఇంటి ద్వారం దగ్గరే నిలబడతారని నమ్మకం. వారికి శ్రాద్ధకర్మ నిర్వహించని పక్షంలో సంతానానికి దీవెనలకు బదులు శపించి వెళ్తారని చెబుతారు. మరణించిన వారు మోక్ష ప్రాప్తి కలగాలంటే వారి కర్మ పరిపక్వం కావాలి. అందుకు దేహధారణచేసి.. పితరులు ఈ లోకంలోకి రావాలంటే వారికి అన్నాన్ని అందించాలి. కొందరికి పుత్ర సంతానంలేక శ్రాద్ధ కర్మలు జరగకపోవచ్చు. అలాంటి వారిపేరిట కూడా తర్పణాలు వదలొచ్చు.

★ పితృపక్షంలో ఆ తిథినాడు శ్రాద్ధం పెట్టలేనివారు శ్రాద్ధం, దానం, తర్పణం చేస్తారు. దీని వల్ల సంతానం ప్రాప్తిస్తుందని పురాణాల్లో పేర్కొన్నారు. పితరులను సంతోష పెడితే సంతతికి ఆయువు, విద్య, ధనం, సంతానం కలిగేలా దీవిస్తారని చెప్తారు. శ్రాద్ధకర్మలో నువ్వులు, గూడమిశ్రిత అన్నం సమర్పిస్తే ఆ దానం అక్షయమవుతుంది.

తర్పణాలు వీడేది ఇలా..

పక్షం రోజుల్లో ఏదో రోజు ఒక అతిథిని ఇంటికి పిలిచి పితృదేవతలకు తర్పణాలు వీడాలి. లేదంటే గయవంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లి శ్రాద్ధకర్మలు నిర్వహించాలి. అలా కుదరని పక్షంలో వారిని స్మరిస్తూ బ్రాహ్మణుడికి స్వయం పాకాన్ని దానంగా ఇవ్వాలి. తండ్రి చనిపోయిన తిథిరోజు మహాలయం పెట్టడం ఉత్తమంగా సూచించారు. వీలుకాకుంటే మహాలయ అమావాస్యరోజున పెట్టాలి.

కూతురుని వివాహం చేసుకున్నాడని తోడల్లుడి హత్య

డిండి, న్యూస్‌టుడే: కూతురు వరుసయ్యే బాలికను తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడని పగ పెంచుకొని ఓ వ్యక్తిని అతని తోడల్లుడు, కుమారులు హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లాలో సెప్టెంబరు 27న చోటు చేసుకుంది. డిండి మండలం చెర్కుపల్లిగేటు సమీపంలో ఇటీవల జరిగిన ఈ హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండలం కామెపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్‌కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్ల పాటు హైదరాబాద్‌లో కలిసి జీవించారు. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో రమాదేవి తల్లిదండ్రుల వద్దకు వచ్చి జీవిస్తుంది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా జగదీష్ వైఖరిలో మార్పు రాలేదు. రమాదేవి మరో సోదరి నిర్మలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కొంకి పెద్దయ్యతో వివాహం జరిగింది. కూతురు వరుస అయ్యే పెద్దయ్య కుమార్తె (బాలిక)తో జగదీష్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరు ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. బాలికను కిడ్నాప్ చేశాడని ఆమె తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జగదీష్ బాలికతో కలిసి ఉంటున్న ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో బంధువులకు పంపించడం మొదలు పెట్టాడు. పరువు పోతుందని భావించిన పెద్దయ్య... సెప్టెంబరు 27న కుమారులు మధు, అరవింద్‌లతో పాటు భార్య నిర్మల, మరదలు రమాదేవితో కలిసి కారులో వారు నివాసం ఉంటున్న అల్వాల్‌కి వెళ్లారు. నిద్రిస్తున్న జగదీష్‌ను కాళ్లు, చేతులు తాళ్లతో.. నోరు, కళ్లు చున్నీలతో కట్టి కారులో దేవరకొండ మీదుగా చెర్కుపల్లికి తీసువచ్చారు. సమీపంలోని గుట్టకు తీసుకెళ్లి జగదీష్‌ను రాళ్లతో పెద్దయ్య, మధు, అరవింద్‌లు హత్య చేశారు. నిర్మల, రమాదేవిలు బయట కాపలా ఉన్నారు. సెప్టెంబరు 28న రైతులు గుర్తు తెలియని శవం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించి పెద్దయ్యను విచారించగా.. కుమారులు అరవింద్, మధుతో కలిసి జగదీష్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. స్థానిక పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 24 గంటల్లో కేసు ఛేదించినందుకు డిండి గ్రామీణ సీఐ సురేష్, ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

తల్లి దూరమై.. కసాయి నాన్న జైలుపాలై

● అమ్మను తలచుకొని రోదిస్తున్న చిన్నారులు

లాలించేందుకు అమ్మలేదు.. బుజ్జగించేందుకు నాన్న లేడు. అభం శుభం తెలియని ఆ చిన్నారులకు తమ తల్లిని మట్టిలో పూడ్చిన విషయమే పదే.. పదే గుర్తుకొచ్చి రాత్రిళ్లు నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి రోదిస్తున్న వారి దైన్యస్థితి స్థానికులను కంట తడిపెట్టిస్తోంది. నాన్న క్షణికావేశం ఆ ముగ్గురు చిన్నారులకు తల్లిని శాశ్వతంగా దూరం చేయగా.. తండ్రి జైలుపాలయ్యాడు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తిలో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఆశ్రయం పొందిన చిన్నారుల పరిస్థితి ఇది. కడపర్తికి చెందిన దాసరి వీరయ్య-రాములమ్మ దంపతుల కుమార్తె సరిత, సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన దాసోజు బ్రహ్మచారి పదేళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి తొమ్మిదేళ్ల లోపు కుమార్తెలు మనోజ్ఞ, మోక్షజ్ఞ, కుమారుడు విశ్వ ఉన్నారు. విద్యుత్తు కార్మికుడిగా పనిచేస్తున్న బ్రహ్మాచారి మద్యానికి బానిసై పనిచేయకుండా, కుటుంబాన్నీ పట్టించుకోవడం మానేశాడు. డిగ్రీ చదివిన భార్య సరిత సూర్యాపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 14న రాత్రి భార్యతో గొడవపడ్డాడు. ఆమె మెడకు వైరుచుట్టి హత్యచేసి జైలుకెళ్లాడు. వీరి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలు ఈ చిన్నారులను చేరదీసి కడపర్తికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కడపర్తి ప్రభుత్వ పాఠశాలలో మనోజ్ఞ 5వ తరగతి, మోక్షజ్ఞ 3వ తరగతి, విశ్వ నర్సరీ చదువుతున్నారు. కాసేపు ఆడుతూ.. పాడుతూ ఉండే చిన్నారులు.. అంతలోనే తల్లి గుర్తుకు వచ్చి మౌనంగా కూర్చుంటున్నారని తాతయ్య ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో రేకుల ఇల్లు మినహా ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, జీవిత చరమాంకంలో ముగ్గురు చిన్నారుల భారం తమపై పడిందని, దారి చూపాలని వేడుకొంటున్నారు. - నకిరేకల్, న్యూస్‌టుడే



అమ్మ చిత్రపటంతో అమ్మమ్మ, తాతయ్య చెంత ముగ్గురు చిన్నారులు

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈనెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

ఏటీఎంలో డబ్బుల చోరీ ముఠా అరెస్టు: డీఎస్పీ

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు ఏటీఎం యంత్రాల్లో సాంకేతిక సమస్యలను సృష్టించి డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలో ఇద్దరు దొంగలను మంగళవారం సూర్యాపేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో మంగళవారం డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గౌరవకుమార్, ఉదయ్‌భాను, విమల్ కలిసి సూర్యాపేటలోని పలు ఏటీఎంలే లక్ష్యంగా చోరీలకు పాల్పడాలని పథకం రచించారు. వారు ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఇక్కడికి వచ్చారు. తమ ఏటీఎం కార్డులను ఉపయోగించి నగదు డ్రా చేసే క్రమంలో యంత్రం నుంచి డబ్బులు బయటకు వస్తుండగా 'లాన్' కేబుల్ తొలగిస్తారు. దాంతో వారి ఖాతా నుంచి డబ్బులు బయటకు వచ్చినప్పటికీ తిరిగి ఖాతాలోకి జమైనట్లు చూపుతాయి. ఈ తరహాలో గత నెల 27న సూర్యాపేటలోని పోచంపల్లి బ్యాంకు ఏటీఎం నుంచి రూ.10 వేలు చోరీ చేశారు. 28న డీబీఎస్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. మంగళవారం మరోసారి పోచంపల్లి బ్యాంకు ఏటీఎంకు రావడంతో అరెస్టు చేసి డెబిట్ కార్డులతోపాటు రూ.10 వేలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో విమల్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, సిబ్బంది కరుణాకర్, కృష్ణ, సైదులు, శివ, మధును అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

కుల బహిష్కరణతో మనస్తాపం..
దంపతుల ఆత్మహత్యాయత్నం

రామన్నపేట, న్యూస్‌టుడే: కుల బహిష్కరణతో పాటు క్షమాపణ చెప్పమన్నారనే విషయంపై మనస్తాపం చెందిన దంపతులు కల్లూరి రమేశ్, వసంత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధితుడి లేఖలో రాసిన వివరాల ప్రకారం.. రమేశ్‌కు ఇతడి సోదరుడు నర్సింహతో గత కొంత కాలంగా భూవివాదం నెలకొంది. కుల పెద్దల సమక్షంలో ఇద్దరికీ వాటాలు పంచారు. తనకు భూమి తక్కువగా వచ్చిందని రమేశ్ ఈ ఒప్పందానికి నిరాకరించారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఆగస్టు 26న రమేశ్ దంపతులు బోనాలు సమర్పించేందుకు దేవాలయానికి వెళ్లగా కులం మాట వినటం లేదని, కుల పెద్ద బోనం పెట్టకుండానే మీరెలా సమర్పిస్తారని ఆ సామాజిక వర్గానికి చెందిన వారు అడ్డుకున్నారు. ఈ విషయంపైనా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు. కుల వృత్తిలో భాగంగా గ్రామంలోని తాటి చెట్లు పంపకంపై సోమవారం గ్రామంలో కులస్థులు సమావేశమయ్యారు. కుల పెద్దలు రమేశ్‌నుద్దేశించి 'నీవు కులం మాట వినటం లేదని, గతంలో జరిగిన సంఘటనలకు సంబంధించి క్షమాపణ చెప్పాల'ని కోరారు. అందుకు రమేశ్ నిరాకరించారు. 'కులపెద్దలు తనను కుల బహిష్కరణ చేశారని, తనను క్షమాపణ చెప్పాలని మానసికంగా వేధిస్తున్నార'ని ఆవేదనకు గురై అదే రోజు రాత్రి భార్య వసంతను తీసుకొని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నామని చరవాణిలో పలువురు స్థానికులకు సమాచారం ఇచ్చాడు. తాను ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలను లేఖలో పేర్కొన్నారు. పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు వారిని వెంటనే హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. క్షమాపణ చెప్పమన్నందుకే రమేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు.

బంతి పూల సాగు.. బాగు

☛ ఉపాధి పొందుతున్న మహిళలు



దేవునితండా, గోపాల్‌పురంలో మహిళా రైతులు సాగు చేసిన బంతి

తుర్కపల్లి, బొమ్మలరామారం, న్యూస్‌టుడే: బంతిపూల సాగు... ఉపాధికి భరోసా ఇస్తున్నాయి. తోటల సాగుపై దృష్టి సారించారు. బతుకమ్మ పండగ, దసరా, దీపావళి, నోములు, వ్రతాలు, కార్తిక మహిళా రైతులు ఆలోచనలతో సాగుకు సిద్ధమవుతున్నారు. సాగు నీటి వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా సీజనల్ పంటలు సాగు చేస్తూ ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకుంటున్నారు. తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు చెందిన మహిళా రైతులు ప్రత్యేకంగా ఆయా రకాల బంతి పూల పౌర్ణమి పండగలతో పాటు శుభకార్యాలు ప్రారంభమయ్యే వేళ బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంత రైతులకు మార్కెటింగ్ సౌకర్యం సులభతరంగా మారింది. పూలను సిటీ పరిసర ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలించి మహిళా రైతులు ప్రతి యేటా ఉపాధి పొందుతున్నారు. ఈ సారి కూడా పసుపు, ఎరుపు, పట్టికుచ్చుల పూలు సాగు చేశారు. పూల తోటలు కళకళలాడుతున్నాయి. మార్కెట్‌కు తరలించేందుకు పూలు సిద్ధంగా ఉన్నాయి. పూల సాగు లాభదాయకంగా ఉంటుందని మహిళా రైతులు పేర్కొంటున్నారు.

బంతి, పట్టుకుచ్చుల పూలు సాగు చేశాం

– చిక్కుడు ఆండాలు



ఈ ఏడు బంతి పూలు, పట్టుకుచ్చుల పూలు (సీత జడ) సాగు చేశాం. వరి పంట కంటే పూల తోటల సాగు ఎంతో మేలు. పూలు కోతకు వచ్చినై అంటే చేతి నిండా డబ్బులు కనిపిస్తాయి. కుటుంబ సభ్యులతో పండగలు సంతోషంగా జరుపుకుంటాం. పండగలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏటా పూల తోటలు సాగు చేస్తాం. వ్యాపారులు తోట వద్దకు వచ్చి కూడా కొనుగోలు చేసి తీసుకెళ్తారు. నేను అర ఎకరం బంతి పూలు, అర ఎకరం పట్టుకుచ్చుల పూలు సాగు చేశాను. కిలో పూలకు రూ.60 నుంచి 80 వరకు ధరలు పలుకుతాయి. సాగుకయ్యే ఖర్చులు పోను ఆదాయం వస్తుంది.

బంతి సాగుతో లాభాలు: - ఎం.బాలమ్మ



బంతి పూలు సాగు చేసే రైతులకు లాభాలు సమకూరుతాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు పంటలు వరి సాగు చేసే వాళ్లం. పెద్దగా లాభాలు ఉండేవి కాదు. ఆదాయం అడాకాడికే ఉండేది. సాగు పద్ధతులు మార్చుకున్నాం. డిమాండ్ బట్టి పంటలు వేయటం ప్రారంభించాం. ఒక్కో సీజన్‌లో ఒక్కో పంట వేస్తున్నాం. తిండి మందం వరి వేసుకుని కూరగాయలు, ఆకు కూరలు సాగు చేయటం అలవర్చుకున్నాం. పండగ వేళ పూలకు డిమాండ్ ఉంటుందని ఈ సారి కూడా ఎకరం బంతిపూలు సాగు చేశాం. తోట బాగానే వచ్చింది. పూలను పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తాం. బతుకమ్మ, దసరా పండగలకు 10 నుంచి 15 క్వింటాల దిగుబడి వస్తుందని భావిస్తున్నాం. క్వింటాకు రూ.5 నుంచి 6 వేలు రావచ్చు.

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందని ప్రధానాచార్యుడు సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్-1, 2 ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. హరిప్రసాద్, ప్రోగ్రాం అధికారి సాయివర్ధన్, జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో కళాశాలలో పరిసరాలను పరిశుభ్ర పరుస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తుర్కపల్లి: మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శోభారాణి వీధుల్లో పర్యటించారు. ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి, విద్యాధికారి మాలతి, ప్రిన్సిపల్ శోభారాణి పాల్గొన్నారు.

రామన్నపేట: పరిసరాల పరిశుభ్రతను పాటించాలని రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన కోరారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో మండల లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానం చేశారు. ఎం.ఏ మజీద్, ఉయ్యాల హనుమంతు గౌడ్, లింగయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, సుక్క శ్రవణ్, డేవిడ్, యాదాసు యాదయ్య, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

మోత్కూరు: మండలంలోని పాటిమట్ల రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం దృశ్య మాధ్యమ కార్యక్రమానికి మండలంలోని ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈవోలు ఎం.అశోక్‌కుమార్, వేణు మాట్లాడారు. డిజిటల్ పంటల సర్వేతో తీవ్ర పనిభారం మోపిందని విమర్శించారు. వ్యవసాయాధికారిణి కీర్తి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆటల్లో విద్యార్థులు రాణించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతిలాల్

మోటకొండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఆటల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని తహసీల్దార్ శాంతిలాల్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల ఎంపిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంగళవారం హాజరై మాట్లాడారు. 14 ఏళ్ల నుంచి 17 ఏళ్ల పిల్లలకు జరిగిన ఈ పోటీల్లో ఎంపికైన పిల్లలు ఈ నెల 3 నుంచి 5 వరకు జిల్లాలోని సంస్థాన్ నారాయణపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. హెచ్‌ఎం రఘురాంరెడ్డి, క్రీడల పీడీలు పూల నాగయ్య, దశరథరెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్, రాజగోపాల్, విశ్వరూపం పాల్గొన్నారు.

తెగుళ్ల యాజమాన్యంపై శిక్షణ



రైతులకు సూచనలు ఇస్తున్న ఏరువాక శాస్త్రవేత్త అనిల్ కుమార్

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని కూనూరులో 'పత్తిలో గులాబీ రంగు కాయ తొలిచే పురుగు, కాయ కుళ్లు తెగులు యాజమాన్యం' అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్ కుమార్, మమత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాశం శివానంద్, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సాయి నిఖిత, ఇంద్రాణి, సింధూజ, మహేశ్వరి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: బీసీ కుల గణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజిక నాయకుడు బట్టు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. భువనగిరి రహదారి బంగ్లాలో మంగళవారం వారు మాట్లాడారు. సురేష్, మధు, సాగర్, ఎలేష్, యశ్వంత్, మల్లికార్జున్, నాగరాజు, పవన్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న యాదగిరి

భువనగిరి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహా సభ డిమాండ్ చేసింది. కిసాన్ సంఘ్ జిల్లా మహా సభ భువనగిరి ఎంఎన్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగింది. వరి పండించిన రైతులందరికీ బోనస్ ఇవ్వాల్సిందేనని, వెంటనే కొనుగోలు కేంద్రాలను తెరవాలని మహాసభ తీర్మానించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల వెంకట్‌రెడ్డి, క్షేత్ర సంఘటనా మంత్రి రాము, రవీందర్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గ.. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోకల యాదగిరి, కార్యదర్శి అయిలేష్ కుమార్, ఉపాధ్యక్షులు వంచ వీరారెడ్డి, కైలాసం, సహాయ కార్యదర్శులుగా సురేందర్, జయరాములు, కోశాధికారిగా అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛత కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, పర్యవరణ ఇంజినీర్ రేణుకుమార్ పాల్గొన్నారు.

హర్షితకు కలెక్టర్ అభినందన



ఎన్‌సీసీ క్యాడెట్ దేవెళ్ల హర్షితను అభినందిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

భువనగిరి, న్యూస్‌టుడే: సాహసోపేతమైన పారాట్రూపర్ కోర్సును పూర్తి చేసిన ఎన్‌సీసీ క్యాడెట్ దేవెళ్ల హర్షితను కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అభినందించారు. బీబీనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సాయుధ మహిళా కళాశాలలో చదువుతున్న ఆమె ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రోలోని ఆర్మీ ఎయిర్‌బార్న్ శిక్షణ కేంద్రంలో పారా బేసిక్ కోర్సును ఆమె పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరూపతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. పారాషూట్ జంపింగ్స్‌ను విజయవంతంగా పూర్తి చేశారని ప్రిన్సిపల్ తెలిపారు. ఇది సాహసోపేతమైన కోర్స్ అని, ఇండియన్ ఎయిర్‌పోర్సు నిపుణుల పర్యవేక్షణలో ఈ కోర్సును చేశారని, దేశ వ్యాప్తంగా 24 మంది బాలురు, బాలికలను ఎంపిక చేయగా తెలంగాణ ఒక్కరే పాల్గొన్నారన్నారు. ఎన్‌సీసీ తెలంగాణ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఆనంద్‌రావు, కళాశాల ప్రిన్సిపల్‌ను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎన్‌సీసీ ఏఎన్‌వో రూప కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నవ వధువు అదృశ్యం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన కాసాని వీరబాబు(30) ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పాతకాసారం గ్రామానికి చెందిన ఓ యువతిని(18) గత ఆగస్టు నెలలో వివాహం చేసుకున్నాడు. వీరబాబు చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని లింగోజిగూడెంలో నివాసం ఉంటూ. స్థానికంగా ఉన్న దివిస్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గత సెప్టెంబరు 28న రాత్రి వీరబాబు పరిశ్రమలో విధులకు వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు ఉదయం 7:30 నిమిషాలకు ఇంటికి రాగా భార్య కనిపించలేదు. దీంతో తన భార్య నానమ్మ పార్శబోయిన గోపమ్మను అడిగాడు. చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో వెతికిన ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో వీరబాబు మంగళవారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

అవీ ఇవీ

నియామకం.. చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం కొయ్యలగూడానికి చెందిన వర్కాల సూర్యనారాయణ తెలంగాణ రాష్ట్ర పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా నియమితులయ్యారు. శ్రీశైలంలోని శ్రీమార్కండేయ అన్నదాన సత్రం అధ్యక్షుడిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు.

వ్యాధి నిరోధక టీకాల అధికారి సందర్శన.. భువనగిరి గ్రామీణం: ఆశా దినోత్సవం సందర్భంగా మండలంలోని బొల్లేపల్లి పీహెచ్‌సీని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక ఆశ డ్రై డే, ఫ్రైడే పాటించాలన్నారు. వైద్యాధికారిణి యామినిశృతి, పల్లె దావఖానా వైద్యుడు డాక్టర్ కొండ మురళి, సత్యనారాయణ, కాంచన, రేణుక, పుష్ప పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం.. భువనగిరి: భువనగిరి వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దేవీ శరన్నవ రాత్రి వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వీర శివాజీ యూత్ అధ్యక్షుడు సూదగాని రాజు మాట్లాడారు. వీర శివాజీ యూత్ సభ్యులు సూదగాని హరీష్, సాయితేజ, సన్నీ, నరేష్, రుత్విక్, సాయిచరణ్, గణేష్, దాత్రక్ సుగుణాకర్, సాయి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: దుర్గా నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేలా కమిటీ నిర్వాహకులు చొరవ తీసుకోవాలని ఎస్సై భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో దుర్గా కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శంకర్ నాయక్, సైదిరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, వంశీగౌడ్ పాల్గొన్నారు.

ఇసుక నిల్వలపై కేసు నమోదు.. రాజపేట: మండలంలోని కుర్రారంలో ఇద్దరు వ్యక్తులకు సంబంధించి అక్రమంగా ఇసుక నిల్వలున్నాయనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం సందర్శించారు. అనుమతికి మించి ఇసుక నిల్వలు ఉండటంతో విచారణ అనంతరం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా తహసీల్దారు దామోదర్ తెలిపారు.

ఓటు నమోదు చేసుకోవాలని ప్రచారం.. చౌటుప్పల్: ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకోవాలని అపస్, తపస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ఓటు నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా జాతీయవాద అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సమాచార సేకరణ మాసోత్సవం.. భువనగిరి: అక్టోబరు మాసాన్ని సమాచార సేకరణ మాసోత్సవంగా జరపాలని ఆర్టీఐ ఆక్టివిస్ట్ కొడారి వెంకటేష్ కోరారు. సమాచార హక్కు చట్టం-2005 ఏర్పడి రెండు దశాబ్దాలు అవుతుందని ఆయన తెలిపారు. భువనగిరి హెడ్ పోస్టాఫీస్‌లో మంగళవారం మొదటి సమాచార దరఖాస్తును రిజిస్టర్ పోస్టు చేసిన అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాలనలో పారదర్శకత జవాబుదారీతనం, అవినీతి రహిత సమాజం కోసం సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీవో సమీక్ష సమావేశం... ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాములు నాయక్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలకు నోటీసులు.. భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: రసాయన పరిశ్రమలు కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతున్న పరిశ్రమలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఈనెల 3న సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కాలుష్యంపై చేపట్టే విచారణకు హాజరు కావాలని దోతిగూడెంలోని పలు రసాయన పరిశ్రమలకు నోటీసులు అందజేశారు.

భాజపా సభ్యత్వ నమోదు.. వలిగొండ: మండల కేంద్రంలోని రెండో వార్డులో భాజపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటా సభ్యత్వ నమోదును మంగళవారం నిర్వహించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి, భాజపా మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, మందుల లక్ష్మి, రాచకొండ కృష్ణ, బచ్చు శ్రీనివాస్, అమరేందర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను అడ్డుకోవడంపై ఖండన.. మోత్కూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలను పరిశీలించేందుకు వెళ్లిన భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామని మండల అధ్యక్షుడు పి.రమేష్, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానికంగా వారు మాట్లాడారు. జంగ శ్రీను, ఆర్.నాగయ్య, జి.మల్లేష్, బి.పిచ్చయ్య, ఎం.అనిల్, క్రాంతికుమార్‌రెడ్డి ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలి.. మోత్కూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి కోరారు. మంగళవారం మండలంలోని పాటిమట్లలో గ్రామ మహాసభ ఆర్.కనకయ్య అధ్యక్షతన జరిగింది. మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, వనం శాంతికుమార్, ఆర్.కనకయ్య, కె.యాదయ్య, డి.నాగరాజు, నారాయణ, సోమయ్య, సాయిలు పాల్గొన్నారు.

గొర్రెల దొంగతనం.. ఆలేరు: బహదూర్‌పేటలో సోమవారం రాత్రి కూళ్ల చంద్రశేఖర్, కూళ్ల సాయిలుకు చెందిన 20 గొర్రెలు, రెండు పొట్టేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితులు మంగళవారం ఆలేరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



శ్రీనవ భారత్ డిగ్రీ కళాశాల బతుకమ్మతో విద్యార్థిని



భూదాన్‌పోచంపల్లిలో...



భువనగిరి: అనాజిపురంలో...



ఆలేరు: కొలనుపాక జడ్పీహెచ్‌ఎస్‌లో..

యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు విద్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు, యువతులు, మహిళా ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో విద్యార్థినులు ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చారు. సామూహికంగా బతుకమ్మ ఆడుతూ రోజంతా గడిపారు. దుర్గామాతను ఆకర్షణీయంగా అలంకరించారు. విద్యార్థినులు దుర్గ అవతారాలతో నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆట, కోలాటం ఆడారు.
- న్యూస్‌టుడే బృందం



తంగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో



బీబీనగర్ లిటిల్ బడ్స్ హైస్కూల్‌లో..



గుండాల ఫాదర్ ఫ్రాన్సిస్ పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



పుట్టపాక గ్రామంలో బతుకమ్మలతో చిన్నారులు

చౌటుప్పల్‌లో బతుకమ్మ ఆడుతున్న కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ లక్ష్మి, పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ట్రినిటీ ప్రిన్సిపల్ ఉజ్జిని →



చౌటుప్పల్, న్యూస్‌టుడే: ముందస్తు బతుకమ్మ సంబరాలు యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ట్రినిటీ స్కూలు ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. 24 అడుగుల ఎత్తు, 14 అడుగుల వలయంతో బంతి, చేమంతి, గులాబీ, జర్బరా, డోజీ రకాలకు చెందిన 21 రంగుల్లోని 12 క్వింటాళ్ల పూలతో ఏకబిగిన 24 గంటల పాటు ఒక్కో పువ్వును పేర్చి ఈ బతుకమ్మను సిద్ధం చేశారు. బతుకమ్మకు ముందు భాగంలో పూలతో అమ్మవారు, వెనుకవైపు శివుడు, ఒకవైపు ఢమరుకం, మరో వైపున త్రిశూలం ఆకారాలు తీర్చిదిద్దారు. స్థానిక మార్కెట్‌యార్డులో ప్రత్యేకంగా సిద్ధం చేసిన స్థలంలో ఈ భారీ బతుకమ్మను ప్రతిష్ఠించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, సుశీలమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ లక్ష్మి జ్యోతిని వెలిగించి మహిళలతో కలిసి బతుకమ్మకు పుష్పార్చన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. రెండు వేల మంది ట్రినిటీ విద్యార్థినులు, వెయ్యి మంది వారి తల్లులు బతుకమ్మను కీర్తిస్తూ ఆడిపాడారు. పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య, తరుణ్యారెడ్డి, ట్రినిటీ ఛైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపల్ డా.ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80082 78928 80085 74375

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:

? యాదగిరిగుట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు మంచినీరు సరిగ్గా రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు చేపట్టాలి.
– భాగ్యమ్మ, యాదగిరిగుట్ట.

✔ సిబ్బందిని ఆదేశించి, వెంటనే చర్యలు చేపడతాం.
– అజయ్ కుమార్‌రెడ్డి, కమిషనర్, యాదగిరిగుట్ట పురపాలిక సంఘం

ఆలేరు, న్యూస్‌టుడే:

? ఆలేరు- బచ్చన్నపేట రహదారిలో కొలనుపాక పెద్దవాగు కాజ్‌వేపై నీటి ప్రవాహంతో ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి
– నమేస్, ఆలేరు

✔ విషయం దృష్టికి వచ్చింది. అవసరమైన చర్యలు చేపడతాం.
– రజనీకర్, ఎస్సై, ఆలేరు

దిష్టిబొమ్మ దహనం

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం దిష్టిబొమ్మను దహనం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ మాట్లాడుతూ సిమెంటు పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్య సమస్య తీవ్రం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీవైఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శానగొండ రామచంద్రం, కార్యదర్శిగా మెట్టు శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. నాగటి ఉపేందర్, హరీశ్, వేముల సైదులు, లెనిన్, ప్రసాద్, తాటిపాముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటే

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: జీవితాన్ని మార్చేది కేవలం చదువు ఒక్కటేనని, లక్ష్యం నిర్దేశించుకుని చదువుతూ ముందుకు సాగాలని యాదగిరిగుట్ట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మంజుల సూచించారు. కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత సేవ (ఫ్రెషర్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆట, పాటలు, నృత్యాలతో అలరించారు.




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

యాదాద్రి పర్యవేక్షకురాలు నియామకం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన పర్యవేక్షకురాలు శ్రీలత డిప్యూటేషన్‌పై తిరిగి యాదగిరిగుట్టకు వచ్చారు. దేవాదాయ శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆగస్టు 6న యాదగిరిగుట్ట నుంచి 26 మంది ఉద్యోగులు వివిధ దేవాలయాలకు బదిలీపై వెళ్లారు. ఇప్పటికే వేములవాడకు బదిలీపై వెళ్లిన పర్యవేక్షకుడు రాజన్ బాబు తిరిగి డిప్యూటేషన్‌పై యాదగిరిగుట్టకు రాగా, యాదగిరిగుట్టలో విధులు నిర్వహిస్తున్న వేములవాడ ఉద్యోగి శ్రీనివాస్‌ను పూర్వ స్థానానికి బదిలీ చేసిన విషయం విధితమే. తాజాగా శ్రీలతను యాదగిరిగుట్ట దేవస్థానానికి కేటాయిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా ఆమె మంగళవారం విధుల్లో చేరారు.

మంత్రి ఉత్తమ్‌కు పలువురి పరామర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పితృవియోగం చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు కనుమూరి బాపిరాజు, తదితరులు పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులను ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి,

పత్తి పంటల పరిశీలన

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామంలో పత్తి పంటలను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. స్థానిక రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో నేటి దృశ్యమాధ్యమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏవో పావని, ఏఈవోలు పాల్గొన్నారు.